25న ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరం

కాచిగూడ, మే 22: ప్రతి ఒక్కరూ కళ్లను అశ్రద్ధ చేయవద్దని యోగక్షేమం మహామ్యహం చారిటీ ట్రస్ట్ సంస్థ వ్యవస్థాపకులు వారణాసి కృష్ణమూర్తి అన్నారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ వాసులకు ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్స శిబిరాన్ని ఈనెల 25న హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి శస్త్రచికిత్స కోసం లిబర్టీలోని సాదూ రామ్ కంటి ఆసుపత్రులలో చికిత్స చేయించబడునని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 93460 12864లో సంప్రదించాలని కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



సీఐని సన్మానిస్తున్న సెంట్రల్ పీస్ కమిటీ సభ్యులు

కాచిగూడ, మే 22: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సుల్తాన్ బజార్ సీఐ కె. నరసింహ విజ్ఞప్తి చేశారు. రానున్న బోనాలు, బక్రీద్ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరిగేటట్లు సెంట్రల్ పరిధిలోని పోలీసులకు సహకరిస్తామని సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్ శ్యామ్ హామీ ఇచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పండుగలకు పీస్ కమిటీ, బస్తీ, కాలనీ ప్రజలు తమ వంతు బాధ్యతగా సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ నరసింహను సెంట్రల్ పీస్ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ సోమని, డాక్టర్.మీర్ యూసుఫ్ హమాద్, సయ్యద్ ఫరీదోద్దీన్ యూనిస్, లక్ష్మణ్, వెంకట్, మహమ్మద్ ఇంతయాజ్, ప్రదీప్, సురేందర్ సింగ్, సిద్ధిక్, విజయ్ రాఠీ, సర్దార్ని బసంతి, హరినివాస్, వేణు గోపాల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆసిఫ్ నగర్ పోలీసులకు ప్రశంసలు

ప్రజల శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా పోలీసులు తక్షణం స్పందించేలాగా కృషి చేస్తున్నామని ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ అన్నారు. ఆసిఫ్ నగర్ చోటి మసీదులో చిన్న గొడవను సకాలంలో నిలువరించినందుకు ఏఎస్ఐ దయానంద్‌ను మసీద్ కమిటీ వారు గురువారం ప్రశంసా పత్రం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలను కాపాడుతున్నామన్నారు.

– మెహిదీపట్నం, మే 22

స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

సంజయ్‌గాంధీనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మే 22: అంబర్‌పేట నియోజకవర్గం, నల్లకుంట డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో రూ.19 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం కృషిచేస్తున్నట్లు తెలిపారు. బస్తీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బస్తీలో కలుషిత మంచినీరు సరఫరా అవుతుందని అన్నారు. రెండు నెలలుగా ఈ సమస్య ఉందని తెలుపగా దీనికి స్పందించిన ఎమ్మెల్యే సంజయ్‌గాంధీనగర్‌లో ఉన్న ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అయితే సమస్యలను తాను బస్తీకి వచ్చినప్పుడే తన దృష్టికి తీసుకురాకుండా.. తమ కార్యాలయానికి వచ్చి తెలియజేయవచ్చని అన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఆవేశానికి వెళ్లకుండా ఆలోచన చేసి అభివృద్ధికి సహకరించాలని కొందరు బస్తీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు గాలపల్లి శంకర్, విజయేంద్రసాగర్, సాయిని మూర్తి, భూపతినాథ్, రమణానాయుడు, మహేశ్, సాయిమోహన్, బీజేపీ నాయకులు కె.జె.బాబు, లక్ష్మణ్, ఎం.బి. కిశోర్‌కుమార్, గోపి పాల్గొన్నారు.

తిరుమలలో కోలేటి పూజలు

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని గురువారం ఉదయం తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి బ్రేక్ దర్శనంలో దర్శించుకున్నారు. .స్వామి వారి ఆశీస్సులు అందుకున్నట్లు కోలేటి దామోదర్ తెలిపారు.

– అబిడ్స్, మే 22

కాచిగూడలో తిరంగా ర్యాలీ

తిరంగ ర్యాలీలో పాల్గొన్న కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ తదితరులు

కాచిగూడ, మే 22: కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ ఆధ్వర్యంలో భారత సైనికులకు మద్దతుగా గురువారం రాత్రి కాచిగూడలోని పలు ప్రాంతాల్లో తిరంగా ర్యాలీని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, సి.వినోద్‌యాదవ్, నందకిషోర్‌యాదవ్, సుభాష్ పటేల్, చిట్టి శ్రీధర్, నర్సింగ్ రావు, అరవింద్, కృష్ణ, సాగర్, వాసు, రమాదేవి, రవి యాదవ్, భీమ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్ పాత్ ఆక్రమణలను కూల్చేస్తున్న జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు

జిర్రా రోడ్డులో పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మెహిదీపట్నం మే 22 : ప్రజలకు నడవడానికి వీలు లేకుండా రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారి పట్ల జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్ 12 పరిధిలోని ఆసిఫ్ నగర్ జిర్రా ప్రధాన రోడ్డులో పుట్ పాత్ ఆక్రమణలను గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చి వేశారు. సర్కిల్ –12 టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ సునీత పర్యవేక్షణలో కూల్చివేతలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సీఐలు ఆనంద్, కోటేశ్వరరావు బందోబస్తును నిర్వహించారు.

సత్కారం..

మల్లేశ్‌ను సత్కరిస్తున్న కల్వకుంట్ల తారకరామారావు

అబిడ్స్, మే 22: ఏషియన్ యూనివర్సిటీ మెన్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కె. మల్లేశ్ రజత పథకాన్ని సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్, మల్లేశ్‌ను బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు వద్దకు తీసుకు వెళ్లగా కేటీఆర్ ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు.

ఉచిత అంబలి పంపిణీ

అంబలి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 22 : తెలంగాణ న్యాయవాదుల సురక్షా సమితి, అంబేద్కర్ భగత్‌సింగ్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని మనోరంజన్ కోర్టు ప్రాంగణంలో గురువారం ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్. జంగయ్య (బీసీ సంక్షేమ ఆర్థిక సంఘం తెలంగాణ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్), సీఎం రేవంత్‌రెడ్డి న్యాయవాది విశ్వేశ్వరరావు, డి. అనంతరఘు (డిఫెన్స్ కౌన్సిల్) అతిథులుగా పాల్గొని కక్షిదారులకు, న్యాయవాదులకు అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మంబ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. కేసుల ఒత్తిడిని తగ్గించుకునేందుకు అంబలి సేవించడం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి హైమద్ పాషా, ఉపాధ్యక్షుడు ఆవుల సత్యనారాయణ, నాంపల్లి బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి పద్మావతి, లైబ్రేరియన్ కార్యదర్శి స్రవంతి, సభ్యులు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అటల్ బిహారీ వాజ్ పేయికి పీవీ స్మారక అవార్డు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, మే 22 : మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కర్త దివంగత పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు, కార్యక్రమాలు, విధానాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి మాదంశెట్టి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జూన్ 28న న్యూఢిల్లీలోని జరిగే పీవీ నరసింహారావు మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమ పోస్టర్, యూట్యూబ్ చానల్‌ను గురువారం నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీవీ నరసింహారావు సోదరుడు పీవీ మనోహర్ రావు, రాజ్యసభ సభ్యుడు సురేశ్ రెడ్డి, మాజీ డీజీపీ హెచ్.జె.దొర, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, ఆర్టీఏ మాజీ కమిషనర్ విజయ్ బాబు లు విచ్చేసి పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసిన మహనీయుడు పీవీ అని కొనియాడారు. పీవీ చరిత్రను ఇతర ప్రాంతాలకు విస్తరింపజేయాలని సూచించారు. పీవీ జ్ఞాపకాలను, ఆయన సేవలను నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఆయన శిష్యుడు అనిల్ కుమార్ అభినందనీయుడని ప్రశంసించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు స్మారక అవార్డును మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయికి ప్రకటించామని, దానిని బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు, పద్మ విభూషణ్ డా. మురళీ మనోహర్ జోషికి జూన్ 28న అందజేయనున్నట్లు తెలిపారు. హైకోర్ట్ అడ్వకేట్ శ్రీకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటలో కమ్యూనిటీహాల్ నిర్మించండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు బతుకమ్మకుంట నివాసులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బి.పద్మారెడ్డి

అంబర్‌పేట, మే 22 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో స్థానికులకు ఒక కమ్యూనిటీహాల్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బస్తీవాసులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి గురువారం హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు ఏదైనా చిన్న మీటింగ్ పెట్టుకోవాలన్నా...చిన్నపాటి ఫంక్షన్ చేసుకోవాలన్నా కమ్యూనిటీహాల్ అవసరమవుతుందన్నారు. కుంటను ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డు స్థలంలో కమ్యూనిటీహాల్‌ను కట్టించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు. నాయకులు మిర్యాల శ్రీనివాస్, జె.బాల్‌రాజు, ఎస్.శేఖర్, ఆర్బీఐ రమేశ్, కె.బాలకృష్ణ, సందీప్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

హిమాయత్ నగర్, మే 22: నారాయణగూడ లోని బాబూ జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లక్ష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెన్‌ప్యాక్ట్, అపోలో ఫార్మసీ, సర్‌టెక్ లాంటి పలు 15 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నగరంలోని అన్ని కళాశాలలకు చెందిన డిగ్రీ పూర్తయిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వారి బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నం. 8099 443921 ను సంప్రదించగలరని కోరారు.

విద్యార్థుల భవిష్యత్‌కు పూల్‌డ్రైవ్ ప్లేస్‌మెంట్ పునాది

అబిడ్స్, మే 22 : ఇంజినీరింగ్ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పూల్ డ్రైవ్ ప్లేస్‌మెంట్ కృషి చేయడం అభినందనీయమని స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎస్. చలమారెడ్డి, కార్యదర్శి ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అన్నా రు. ఐటీ దిగ్గజ కంపెనీ టెక్ మహేంద్ర పూల్ డ్రైవ్ ప్లేస్ మెంట్ కార్యక్రమాన్ని గురువారం స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించింది. 52 మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చెదలవాడ లక్ష్మీనాథ్, డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బండ్లగూడ, మే 22: అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్తాపూర్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అత్తాపూర్ తేజస్వీనగర్‌కు చెందిన గోపాల్ బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

స్పెషల్ రైల్లో దొంగతనం

కాచిగూడ, మే 22: కాచిగూడ స్పెషల్ రైల్లో దొంగతనం జరిగింది. రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. జైపూర్‌కు చెందిన కోమలి స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా కామారెడ్డి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు కోమలి బ్యాగును దొంగలించారు. అందులో 5 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 8 వేలు, 2 ఫోన్లు ఉన్నట్లు తెలిపారు. గురువారం బాధితురాలు ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పీఎస్‌లో కేసు నమోదు చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ కు బదిలీ చేసినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్‌జన్మోత్సవం

దేవాలయంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న రాజేందర్ పటేల్ గౌడ్

కాచిగూడ, మే 22: ఆధ్యాత్మికత చింతనతో భక్తిభావం పెంపొందించుకోవాలని హిందూ శ్మశాన వాటిక ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ అన్నారు. గురువారం హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా సాయిగిరిధర్ ఆధ్వర్యంలో సుప్రభాత, అలంకార సేవ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్ కుమార్ విగ్, విజయ్ కుమార్, రతన్ విద్యాసాగర్, బి.కృష్ణగౌడ్, సత్యనారాయణ, శివ కుమార్, యాదయ్య, నరేష్, భక్తులు పాల్గొన్నారు.

అంబర్‌పేట : హనుమాన్ జయంతి వేడుకలను గురువారం అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్‌లలోని హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిబాబా దేవాలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోల్నాక : హనుమాన్ జయంతి వేడుకలను అంబర్ పేట డివిజన్ లో ఘనంగా నిర్వహించారు. గురువారం హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా పటేల్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ హాజరై.. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పటేల్‌నగర్ ఆలయంలోని హనుమాన్ పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

గోల్కొండ మోహల్లాగంజ్ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న బస్తీ వాసులు

మెహిదీపట్నం : కార్వాన్ నియోజకవర్గ గోల్కొండ మోహల్లా గంజ్ లో గురువారం హనుమాన్ జన్మ ఉత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ బోనాల కుల వృత్తుల సంఘం సలహాదారు సాయిబాబా చారి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ చారి, మహంకాళి ఆలయ పూజారి సురేష్ చారి పాల్గొన్నారు.

తెలంగాణ స్టేట్ ఆడిట్ మాల్దీవుల ప్రతినిధులకు శిక్షణ

తెలంగాణ ఆడిట్ కార్యాలయంలో మాల్దీవుల ప్రతినిధుల బృందం

అబిడ్స్, మే 22 : విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఎన్ఐఆర్డీడి, రిపబ్లిక్ ఆఫ్ మాల్దీవుల దేశం మధ్య 2022లో జరిగిన ఒప్పందం మేరకు మాల్దీవుల స్థానిక సంస్థల ప్రతినిధులకు, అధికారులకు మే 19వ తేదీ నుంచి జూన్ రెండవ తేదీ వరకు ఎన్ఐఆర్డీ ద్వారా అందించే శిక్షణలో భాగంగా గురువారం అబిడ్స్‌లోని స్టేట్ ఆడిట్ కార్యాలయంలో ఆడిట్ డైరెక్టర్ మారుతినేని వెంకటేశ్వరరావు మాల్దీవుల స్థానిక సంస్థల ప్రతినిధులకు అధికారులకు ఆడిట్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మూడు గంటల పాటు క్లుప్తంగా వివరించారు. ఈ శిక్షణలో మాల్దీవుల స్థానిక సంస్థల ప్రతినిధులు స్థానిక సంస్థల ఆడిట్‌కు సంబంధించి అనేక విషయాలను తెలుసుకోవడంతో వారు తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఐఆర్డీ ట్రైనింగ్ సెంటర్ హెడ్ డాక్టర్ అంజనీ కుమార్, ట్రైనింగ్ మేనేజర్ శిరీషల శిక్షణలో భాగంగా స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా లు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. స్టేట్ అడిట్ జెడి రాము ఆర్డిడి రేవతి, పరుశురాం, వెంకట్, ఆడిట్ అధికారులు వినోద్, ఆదిత్య దీప్తి తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

దీర్ఘకాల సమస్యలు పరిష్కరించండి

కె.ర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఫక్రుద్దీన్ అహ్మద్, టీజీ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌లను సత్కరిస్తున్న టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ నాయకులు

అబిడ్స్, మే 22. టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కె.ర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఫక్రుద్దీన్ అహ్మద్, టీజీ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌ను, డిప్యూటీ సెక్రటరీ జనరల్ శ్రీ ఎస్.ఎం. హుసేని ముజీబ్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా మరి బొకేలతో సత్కరించి డిపార్ట్మెంట్‌కు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిడ్ డే మీల్స్ పోస్టులను (10 అసిస్టెంట్ డైరెక్టర్, 10 సూపరింటెండెంట్ మరియు 20 సీనియర్ అసిస్టెంట్) అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ కొరకు, పాత పద్ధతి ప్రకారంగా అర్హులైనటువంటి మినిస్టీరియల్ సిబ్బందికి జూనియర్ లెక్చరర్, స్కూల్ అసిస్టెంట్ మరియు ఎస్జీటీలుగా 10% కోట ప్రకారంగా పదోన్నతులు కల్పించాలని, నూతనంగా ఏర్పడిన జిల్లాలలో యూనిఫామ్ క్యాడర్‌స్ట్రెంత్ నియమించాలని, ఓపెన్ స్కూల్లో సపోర్టింగ్ స్టాఫ్ కల్పించుటకు, ఇతర జోన్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ చార్మినార్ జోన్ అక్రమ కేటాయింపు పై వివరించడం జరిగిందని అన్నారు. దీనికి స్పందించిన వారు ప్రతి సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం అసోసియేట్ ప్రెసిడెంట్ ఏం దేవేందర్, ట్రెజరర్ శ్రీ పవన్ బాబు, వైస్ ప్రెసిడెంట్లు ఎం. భాస్కర్ , ఆర్ అశోక్, జాయింట్ సెక్రటరీలు రమేశ్, సుదర్శన్, శ్రీనివాస్ బాబు, పబ్లిసిటీ సెక్రటరీలు టి. దిలీప్‌కుమార్‌యాదవ్, ఫిరోజ్, శ్రీమతి అరుణ జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శివ, శ్రీనివాస్, శేఖర్, కల్చరల్ సెక్రటరీలు రాకేశ్, వినయ్, అఖిల్,ఈసీ మెంబర్లు యోగేందర్, శివరాజ్, ప్రశాంత్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ తరపున ట్రెజరర్ ప్రేమ్, వైస్ ప్రెసిడెంట్ రుగేష్, జాయింట్ సెక్రెటరీ శ్రీమతి జయంతిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం వచ్చి.. గంజాయి విక్రయం

బంజారాహిల్స్,మే 22 : ఉద్యోగం కోసం నగరానికి వచ్చిన ఓ యువకుడు గంజాయి విక్రేతగా మారి పోలీసులకు పట్టుబడ్డాడు. ఫిలింనగర్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరికి చెందిన కే రాహుల్(27) బీటెక్ పూర్తిచేసి ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. కొండాపూర్‌లో నివాసం ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న క్రమంలో ఇటీవల ఎల్బీనగర్‌కు చెందిన మహేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనవద్ద గంజాయి ఉందని,దాన్ని అవసరం ఉన్న వారికి విక్రయించి డబ్బులు సంపాదించవచ్చని మహేష్ చెప్పడంతో కొంతకాలంగా రాహుల్ గంజాయి విక్రేతగా మారాడు. ఈ క్రమంలో ఫిలింనగర్ సమీపంలోని కొత్త చెరువును ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో గంజాయి అమ్మేందుకు వచ్చిన రాహుల్ మీద ఫిలింనగర్ పోలీసులు నిఘా పెట్టారు. స్వయంభూ, కుందన్ అనే వ్యక్తులకు గంజాయి విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడు రాహుల్ వద్ద నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.